క్లుప్తంగా

ఓటు హక్కును వినియోగించుకోండి



తెనాలిఅర్బన్: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష పేర్కొన్నారు. కొలెవరం గ్రామంలోని సచివాలయం వద్ద మంగళవారం సాయంత్రం ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అందరూ నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటు వినియోగిస్తామనే ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో ఏపీసీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, కొలెవరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ నెల 9న హనుమాన్ చాలీసా పారాయణం

తెనాలిటౌన్: బోసు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 9న క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ పురస్కరించుకుని సాయంత్రం 5 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్టు హనుమాన్ సేవా సమితి నిర్వాహకులు వుప్పల వరదరాజులు మంగళవారం తెలిపారు. అనంతరం ములుకుట్ల విశ్వనాధశర్మచే పంచాంగ శ్రవణం జరుగుతుందన్నారు. హనుమాన్ చాలీసా పారాయణ చేసేవారు ముందుగా తమ పేర్లను 9849346569 నంబరుకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు.

కలెవరంలో ఆరవ రోజు..




తెనాలిటౌన్: రూరల్ మండలం కొలెవరం గ్రామంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం మంగళవారం ఆరవ రోజు జరిగింది. పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పినపాటి అనిల్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సంకురు బుజ్జిబాబు, గ్రామ ఉపసర్పంచ్ షేక్ బాబు సాహెబ్, పార్టీ గ్రామ కన్వీనర్ తమ్మా శివారెడ్డి, బాలగురవమ్మ, మంచాల శ్రీనివాసరావు, షేక్ ఆదాం షఫీ, ఆర్.శ్రీనివాసరెడ్డి, కారుమూరు వీరారెడ్డి, చిన్నిబాబు, తాడిబోయిన శంకరరావు, తుల్లిమిల్లి సువర్ణబాబు, గాలి శివకుమార్, చావాలి అశోక్, గంపల హేమచంద్రరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి లేఖన క్రీస్తు మహాసభలు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని రైల్వేస్టేషన్ సమీపంలో ఈ నెల 3, 4, 5 తేదీలలో లేఖన క్రీస్తు మహాసభలు నిర్వహిస్తున్నట్లు బ్రదర్ ఎ.పరిశుద్ధరావు మంగళవారం తెలిపారు. హోలీ అపోస్తలిక్ మిషన్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 11 గంటలకు, సాయంత్రం 6.30 గంటలకు సభలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రజలు మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సార్వత్రిక ఎన్నికలపై అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: వచ్చేనెలలో జరిగే సార్వత్రిక ఎన్నికలపై సౌత్‌జోన్ డీఎస్పీ మెహబూబ్‌బాషా ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. 40వ డివిజన్ పెదపలకలూరు గ్రామంలో జరిగిన సదస్సులో అన్ని పొలిటికల్ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగిలే ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అందుకు అన్ని పార్టీల సహాయ సహకారాలు అవసరమని తెలిపారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని తెలిపారు. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్ కుమార్, ఎస్ఐ సత్యనారాయణ, గ్రామ ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదవర్గాల అభ్యున్నతే ప్రభుత్వ సంకల్పం

- అందుకే పరిపాలనలో విప్లవాత్మక సంస్కరణలు
- సంక్షేమం, విద్య, వైద్యం, రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం
- అండగా నిలుస్తున్న సీఎంను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదరించాల్సిన బాధ్యత ఆయా వర్గాలదే
- వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ ఎరుకల సంఘీయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పేదలు, మధ్యతరగతి వర్గాలు, చిన్నకులాల వారిని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ప్రగతి బాటలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం చేసిన కృషి చరిత్రాత్మకమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. సంక్షేమ పథకాలతో ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు తోడ్పడుతూ, విద్య, వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చి, రాజకీయ భాగస్వామ్యం కోసం నామినేటెడ్ పదవులను కల్పిస్తూ, పరిపాలనలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చినట్టు గుర్తు చేశారు. ఇవన్నీ వారి భవిష్యత్‌కు ఎంతగానో తోడ్పడతాయన్నారు. అండగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయా వర్గాలు ఆదరించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఎరుకల సంఘీయుల ఆత్మీయ సమావేశం మంగళవారం ఇక్కడి ఏ1 కల్యాణ మండపంలో నిర్వహించారు. ఏపీ ఎరుకల ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు అధ్యక్షత వహించారు. అయిదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమాన్ని ఏవిధంగా అందించాలో చేసి చూపించిందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఈ రకంగా లబ్ధిదారులకు నేరుగా నగదు అందించలేదన్నారు. పేదవారిపై సీఎంకు గల అపారమైన ప్రేమ కారణంగానే అవ్వాతాతలు, దివ్యాంగులకు వలంటీర్లు ప్రతినెల ఇంటికే వచ్చి పింఛన్లు ఇస్తున్నట్టు చెప్పారు. పేదల ఆరోగ్య భరోసా కోసం ఆరోగ్యశ్రీ కార్డుంటే రూ.25 లక్షల వరకు వైద్యసాయం పొందే అవకాశం కల్పించారని గుర్తు చేశారు. మరోవైపు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించేందుకు చిన్నకులాల్లోని వారికీ నామినేటెడ్ పదవులు కల్పించామని చెప్పారు. ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తోందీ గమనించాలన్నారు.

- పదేళ్లు ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి, తెనాలికి ఏ సాఫ్ట్‌వేర్ కంపెనీ తీసుకొచ్చాడు? ఏ పరిశ్రమ స్థాపించాడు? ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చాడు? చెప్పాలని ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను ప్రశ్నించారు. గత అయిదేళ్లలో రెండేళ్లు కరోనా విలయతాండవం చేసిన రోజుల్లోనూ తాను నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ఆహారం, నిత్యావసర సరకులు, కూరగాయలు అందించి, బాధితులకు వైద్యసాయంలో గడిపానని వివరించారు. తర్వాతి మూడేళ్లలో రూ.1800 కోట్ల సంక్షేమాన్ని నేరుగా ప్రజలకు అందించామన్నారు. 27 వేల మందికి ఇళ్ల స్థలాలు అందజేశామని, పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి వెయ్యి మందికి కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వలేకపోయారని అన్నారు. సంఘీయుల విజ్ఞప్తి ప్రకారం అసోసియేషన్‌కు స్థలం, తెనాలి బండ్‌పై ఏకలవ్య విగ్రహ స్థాపనకు సహకరిస్తానని హామీనిచ్చారు. నియోజకవర్గ పరిశీలకుడు మందపాటి శేషగిరిరావు, రాష్ట్ర గిరిజన విభాగ కార్యదర్శి కట్టా బుల్లియ్య, మేడా కృష్ణ, దేవరకొండ వెంకటరమణ, ఏపీ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గరిక శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ముకర వీరయ్య, పాలపర్తి శ్రీను, పాలపర్తి మహేష్, పాలపర్తి రత్నం, గరిక గోపి, కట్టా నాగరాజు, కట్టా లక్ష్మి, కట్టా సాంబయ్య, ఇట్టా కోటేశ్వరరావు, కట్టా భారతి, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి మానుపాటి చిరంజీవి, సాంబశివనాయక్, కొండరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్



పిడపర్రులో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

పిడపర్రు(కొల్లిపర): మండలంలోని 51 పోలింగ్ కేంద్రల్లో పక్కాగా వసతులు కల్పించాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని పిడపర్రు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్‌లతో కలసి తనిఖీ చేశారు. బీఎల్‌వోల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి, కేంద్రాల్లో ఓటర్లకు కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విభిన్న ప్రతిభావంతులు వంద శాతం ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. పింఛన్ల కోసం నగదును బ్యాంకుల నుంచి తీసుకురావడం, పంపిణీ చేసే ప్రక్రియను తహసీల్దారు, ఎంపీడీవోలు పకడ్బందీగా పంపిణీ పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు చంద్రమోహన్, పూర్ణశంకరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

- శిరిపురంలో ఆరుగురు సేవకు గుడ్‌బై
- ప్రతిపక్షాల కుట్రలకు నిరసనగా వైదొలుగుతున్నట్టు వెల్లడి
- ఇకపై జగనన్న సైనికులుగా ప్రచారం చేస్తామని స్పష్టీకరణ



రాజీనామా పత్రాలతో వలంటీర్లు

తెనాలి: వలంటీర్లను పదేపదే అవమానిస్తూ మాట్లాడటం, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయించి పింఛన్ల పంపిణీని దూరం చేసిన ప్రతిపక్షాల కుట్రలకు నిరసనగా కొల్లిపర మండలం శిరిపురం గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమ గ్రామ సర్పంచ్ పచ్చవ సులోచన రమేష్‌తో కలిసి మంగళవారం రాత్రి తెనాలి వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను కలిశారు. తాము వలంటీరు విధులకు రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీల నేతలు తమను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలు, పింఛను పంపిణీ నుంచి కుట్రతో తమను దూరం చేయటంతో మనస్తాపానికి లోనైనట్టు చెప్పారు. తమపై అభాండాలు వేస్తూ నిత్యం చేస్తున్న ప్రచారాన్ని తట్టుకోలేకపోతున్నామని, దీనికి తోడు అవ్వాతాతలు, దివ్యాంగులు పింఛన్ల కోసం ఫోన్లు చేస్తుండటంతో ఏమీ చేయలేని నిస్సహాయతకు లోనైనట్టు వలంటీర్లు తెలిపారు. ఈ బాధ కన్నా నేరుగా ఎన్నికల క్షేత్రంలోకి దిగి, తమ సర్పంచ్ పచ్చవ సులోచన రమేష్ నాయకత్వంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ముఖ్యమంత్రి జగనన్న గెలుపు కోసం కృషి చేయాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే శివకుమార్‌కు తెలియజేశారు. దీంతో శిరిపురం గ్రామంలో ఒక్క వలంటీరు కూడా అందుబాటులో లేనట్టయింది. రాజీనామా చేసిన వారిలో అత్తోట ప్రవీణ్‌బాబు, అత్తోట సుప్రియ, బత్తుల కిశోరలక్ష్మి, కొక్కిలిగడ్డ శ్రావణి, అత్తోట సుకుమార్, అత్తోట సుమతి ఉన్నారు.

రచయిత శ్రీరామకృష్ణ మరణం సినీ పరిశ్రమకు తీరనిలోటు

మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: తమిళ, తెలుగు అనువాద చిత్రాల సంభాషణల రచయిత, సినీదర్శకుడు తెనాలికి చెందిన శ్రీరామకృష్ణ మృతికి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా-ఏపీ) సంతాపం వ్యక్తం చేసింది. రూరల్ మండలం పెదరావూరులోని స్టూడియోలో మంగళవారం సాయంత్రం శ్రీరామకృష్ణకు నివాళి అర్పించింది. అనంతరం మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ దాదాపు 300పైగా సినిమాలకు సంభాషణలు అందించిన శ్రీరామకృష్ణ స్టార్ రైటర్‌గా గుర్తింపు పొందారని చెప్పారు. బొంబాయి, జీన్స్, ఒకేఒక్కడు, అపరిచితుడు, భారతీయుడు, జంటిల్‌మెన్, చంద్రముఖి, రోబో వంటి ఎన్నో విజయవంతమైన సినిమాలకు శక్తివంతమైన సంభాషణలను అందించిన గొప్ప రచయిత తెనాలి వాసి కావటం గర్వకారణమన్నారు. ప్రఖ్యాత నటి ఐశ్వర్యారాయ్ జీన్స్ చిత్రంలో సంభాషణలు పలికే తీరును శ్రీరామకృష్ణ దగ్గరే నేర్చుకున్నానని చెప్పటం ఆయనలోని ప్రతిభకు నిదర్శనమన్నారు. తెనాలిలో ఎదిగి, చెన్నైలో రైటర్‌గా స్థిరపడిన శ్రీరామకృష్ణ, కొన్ని తమిళ సినిమాలకు సంభాషణలు రాయటమే కాకుండా మణిరత్నం, శంకర్ సినిమాలకు అనువాద రచయితగా పనిచేశారని సోదాహరణంగా చెప్పారు. బాలమురళి ఎంఏ, సమాజంలో స్త్రీ సినిమాలకు దర్శకత్వం కూడా వహించినట్టు గుర్తు చేశారు. ఆయన మరణం సినీపరిశ్రమకు తీరని లోటన్నారు. వీరితో సహాయ నటులు మిలటరీ ప్రసాద్, అమీర్‌చౌధురి, సహాయ దర్శకుడు వెంకీ రావణ్‌లు ఉన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి



తెనాలిఅర్బన్: రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగాలంటే అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం 16వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాళిదాసు విజయశ్రీ, కాళిదాసు వెంకటసత్యం, కాకి దేవసహాయం, చుండూరు వెంకటేశ్వరరావు, టెక్స్ బాల, కఠారి హరీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

కాకుమాను: పెదనందిపాడు మండల ఎంఈఓ కార్యాలయం వద్ద బుధవారం ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఐఈడీ టీచర్ కె.వి.ఎస్.పూర్ణచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకుమాను, పెదనందిపాడు, పొన్నూరు, ప్రత్తిపాడు మండలాల్లోని 6–18 సంవత్సరాల వయస్సు గల ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ప్రముఖ ఫిజియోథెరపిస్టుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షల అనంతరం వారికి అవసరమైన పరికరాలను గుర్తించి, రెండు నెలల్లో ఉచితంగా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. శిబిరానికి వచ్చేవారు సంబంధిత ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులతో పాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని ఆయన కోరారు. శిబిరానికి వచ్చేవారికి బస్ చార్జీలతో పాటు అల్పాహారం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు మండలాల్లో ఉన్న ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

పెదకాకాని అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయాలి

పెదకాకాని: నియోజకవర్గ పునర్విభజనలో పెదకాకాని శాసనసభ నియోజక వర్గం ఏర్పాటే లక్ష్యంగా సాధన సమితి కృషి చేస్తుందని సమితి కన్వీనర్ బోయపాటి వెంకటరమణ అన్నారు. పెదకాకానిలో పెదకాకాని అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఏర్పాటుకు అన్ని అర్హతలు కలిగి ఉందన్నారు. టీఎస్‌టీయూఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి మన్నవ సత్యన్నారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొల్లికొండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఆదుకుంటాం



మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సమగ్ర శిక్ష జిల్లా ఎడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి, మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణలు పేర్కొన్నారు. బాలాజీరావుపేటలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత నిర్ధారణ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బుద్ధి మాంద్యం, వినికిడి, దృష్టి లోపాలు ఉన్న వారికి పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. శారీరక వైకల్యం ఉన్న వారికి వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, రోటోవేటర్స్, బుద్ధి మాంద్యం ఉన్న వారికి ఎంఆర్ కిట్స్, కంటి చూపు దెబ్బతిన్న వారికి బ్రెయిలీ కిట్లు అందిస్తామని చెప్పారు. వీటన్నిటిని ప్రభుత్వం ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. అలాగే భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. పిల్లల రవాణా అలవెన్స్‌లు, ఎస్కార్ట్, హెచ్‌బీఏ, రీడర్ అలవెన్స్‌లు, గర్ల్స్ స్టైపెండ్ వంటివి ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. ఎంఈవో–2 వి.జయంతిబాబు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సహకారంతో భవిత కేంద్రాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అనంతరం జిల్లా వైద్యశాలలోని వైద్యులు చిన్నారులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సహిత విద్యా విభాగం సమన్వయ కర్త ఎస్.శ్రీనివాసరావు, పలువురు టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికలలో జగన్‌కు అండగా నిలవండి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కోరారు. తెనాలి నియోజకవర్గ పరిధిలోని విశ్రాంత ఉద్యోగులతో కొత్తపేటలోని దేవిప్రియా ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో అనేక సంస్కరణలు తీసుకురావడం జరిగిందన్నారు. పేదలందరికీ సంక్షేమం అందించడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు దేవరపల్లి కిషోర్‌కుమార్, కనపర్తి నవంబర్, ఏటుకూరి మధుబాబు, వసంతరావు, రాజశేఖర్, కంచర్ల ప్రభుదాసు, కొల్లిపర దత్తు, మన్నవ శాంతిశ్రీ, జల్లి గంటయ్య, దాసరి మార్టిన్‌లూథర్, కొలెవరపు దేవానంద్, చిలువూరి సుబ్రమణ్యం, పినపాటి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలో ఆర్వో ప్లాంటు



గుంటూరు మెడికల్: గోరంట్ల ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వసతి భవనంలో నాట్కో ట్రస్టు ప్రతినిధులు ఆర్వో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ అభ్యర్థన మేరకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును మంగళవారం ట్రస్టు వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంటూరు జీజీహెచ్‌లో రూ. 45 కోట్లతో నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మించి పేదలకు అంతర్జాతీయ స్థాయి క్యాన్సర్ వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థినుల సమస్యలపై తమ ట్రస్టు తక్షణమే స్పందించి ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధారమణశ్రీ, పరిపాలన అధికారి వెంకట్రావు, ఆఫీస్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్లు కూరాకుల శ్రీనివాస్, లంకపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వలంటీర్ల ద్వారానే పింఛన్లు పంపిణీ చేయాలి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లను వలంటీర్ల ద్వారానే ఇంటింటికి వెళ్లి అందించేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగ విభాగం నాయకుడు బండారు దుర్గారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకునే పరిస్థితి లేదని తెలిపారు. పట్టణాల్లో కొన్ని వార్డు సచివాలయాలు రెండో అంతస్తులో ఉన్నారని, ఎలక్షన్ కమిషన్ పింఛన్ల పంపిణీలో పునరాలోచన చేయాలని పేర్కొన్నారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ తెనాలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, తెనాలి

సక్సెషన్ ఓ.పి. నెం. 59/2024

పిటీషన్
1. షేక్ గౌస్ బాషా S/o మహబూబ్ సుభాని
2. షేక్ యాస్మిన్, భర్త గౌస్‌బాషా
3. షేక్ అఫ్రీన్ తండ్రి గౌస్ బాషా

ఇంటి నెం.8-3-59, కొలెవరం రోడ్డు, బాలాజీరావుపేట, మసీదు దగ్గర, తెనాలి గుంటూరు జిల్లా. సెల్: 9885625900

-పిటీషనర్లు
ఎదిరిలు:
-నిల్- -రెస్పాండెంట్లు

ఈ నెంబరున మొదటి మరియు 2వ పిటీషనరు కుమారుడు మరియు 3వ పిటీషనరు అన్నగారు అయినటువంటి షేక్ మహబూబ్ తెలంగాణ రాష్ట్రంలోని జె.కె. టైర్స్ (ఇండియా లిమిటెడ్), పటాన్‌చెరు, సంగారెడ్డి జిల్లాలో పనిచేయుచూ యాక్సిడెంటులో గుర్తు తెలియని వాహనము ఢీ కొని చనిపోయినందున సదరు పటాన్‌చెరు పోలీసువారు క్రైం నం.383/2023 రిజిస్టరు కాబడినందున సదరు జె.కె. టైర్స్ (ఇండియా లిమిటెడ్), పటాన్‌చెరు కంపెనీవారు సదరు తమ కంపెనీలో పని చేయుచున్న ఎంప్లాయి ఐ.డి. నెం. యం.సి.యస్ 01701 షేక్ మహబూబ్‌కు రావలసిన కాంపెన్సేషన్ సొమ్ము సుమారు రూ.6,00,000/- లు తీసుకొనుటకు గౌరవనీయులైన పై కోర్టు వారి నుండి లీగల్ హైర్ సర్టిఫికెట్ (సక్సెషన్ సర్టిఫికెట్) తీసుకొని, పై కంపెనీ వారికి సబ్‌మిట్ చేసిన యెడల పైన ఉదహరించిన సొమ్ము పిటీషనర్లకు ఇవ్వగలమని తెలియజేసినందున, పై కోర్టులో సదరు పిటీషనర్లు సదరు మహబూబ్ తాలూకు పైన ఉదహరించిన సొమ్ము పొందుటకు సక్సెషన్ సర్టిఫికెట్ పొందుటకు కేసు దాఖలు చేసి వున్నారు. కావున ఇందు విషయమై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టులో తేది. 22-4-2024న పై కోర్టువారి ఎదుట హాజరు అయ్యి తెలుపుకోవలసినది. లేనియెడల ఏకపక్షముగా తీర్మానించి ఉత్తర్వులు ఇవ్వబడును.

మిక్కిలి శరత్, తోట చంద్రశేఖర్
వేమూరి రాజశేఖర్, అడ్వకేట్స్, తెనాలి.
సెల్. 98484 20144

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

డీఎస్పీ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్, పక్కన సీఐలు

తెనాలిరూరల్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని డీఎస్పీ ఎం.రమేష్ విజ్ఞప్తి చేశారు. సబ్ డివిజన్‌లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రముఖులతో పీస్ కమిటీని పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులతో పోలీసు అధికారులు మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, రానున్న ఎన్నికలనూ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. సబ్ డివిజన్‌లోని తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో ఎక్కడా ఎటువంటి అలజడులు రేగకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా సబ్ డివిజనల్ పీస్ కమిటీని ఏర్పాటు చేసినట్టు వివరించారు. అన్ని వర్గాలకు చోటు కల్పిస్తూ కమిటీని ఏర్పాటు చేశామని, ఎన్నికలు పూర్తయ్యే వరకు సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ చిన్నపాటి అలజడి రేగినా వెంటనే అక్కడి వారితో మాట్లాడడంతో పాటు సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలన్నారు. రెండు నియోజకవర్గాల్లో కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. సమావేశానికి హాజరైన వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో తెనాలి వన్‌టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, రూరల్, పొన్నూరు టౌన్ సీఐలు జి.దశరథరామారావు, ఎ.సుధాకర్, ఎస్.రమేష్‌బాబు, టి.వెంకటేశ్వర్లు, భాస్కర్, తెనాలి రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ మహేష్‌కుమార్, పొన్నూరు టౌన్ ఎస్ఐ భార్గవ్ పలు సూచనలు చేశారు. పీస్ కమిటీతో త్వరలో మరికొన్ని సమావేశాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

శాస్త్రీయ దృక్పథమే ప్రగతికి పునాది



మాట్లాడుతున్న సలీమ్ మాలిక్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో అడుగులు వేయడం ద్వారా ప్రగతిని సాధించగలరని మానవత రక్త దాతల సంస్థ ఆంధ్రప్రదేశ్ కో–కన్వీనర్ సలీమ్ మాలిక్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని టార్గెట్ ఐఐటీ అకాడమీలో మంగళవారం ''రక్తదానంపై అవగాహన- శాస్త్రీయ దృక్పథం'' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 18 ఏళ్లు నిండి, ఆరోగ్యవంతులుగా ఉన్న వారు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసంగిస్తూ రెండేళ్లుగా గుంటూరు నగరంలోని అనాథ, వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సలీమ్ మాలిక్ వివిధ రకాల మాయలతో ప్రజలను బురిడీ కొట్టించే విధానాన్ని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. శిక్షణ సంస్థ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, సామాజికవేత్త కంది పున్నారెడ్డి, మానవత సభ్యులు నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లు



మంగళగిరి: కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో మార్చి 30, 31వ తేదీలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టర్లు పతకాలు సాధించినట్లు పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు తెలిపారు. పట్టణంలోని అసోషియేషన్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ స్కూలు గేమ్స్‌లో అండర్ -17, 19 విభాగాలలో పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లు అసోషియేషన్ కార్యదర్శి షేక్ సంధాని పలువురు అసోషియేషన్ ప్రతినిధులు అభినందించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన వారిలో అండర్ -17లో పి.అంజిలి(స్వర్ణ పతకం), ఇ.లక్ష్మి వినయశ్రీ (స్వర్ణం), జి.హేమవర్ధన్ (స్వర్ణం) సాధించడంతో పాటు స్ట్రాంగ్ టైటిల్ సాధించారన్నారు. అండర్ - 19లో పి.శ్రావణి (స్వర్ణం), గుమ్మడి కుమార్ (స్వర్ణం), వై.నిఖిల్ స్వర్ణ పతకం సాధించినట్లు తెలిపారు.